# సమ్మర్ యాక్షన్ ప్లాన్ రెడీ..!

-డిమాండ్ పెరిగినా..
ఇబ్బందులు రాకుండా చర్యలు
-లోడ్ ఎక్కువగా ఉన్న
ప్రాంతాల్లో డిటిఆర్‌ల పెంపు
-కొత్తగా 11కెవి, 33కెవీ
ఫీడర్లు ఏర్పాటు
-గతేడాది 89.54 మిలియన్
యూనిట్లు వినియోగం
-ఈఏడాది 95 నుంచి 100
ఎంయూలకు చేరే అవకాశం



**హైదరాబాద్, జనవరి 22,ప్రభాతవార్త:** వేసవికి విద్యుత్‌శాఖ సిద్ధమవుతుంది. వేసవి ప్రారంభానికి ముందే గ్రేటర్ జోన్‌పరిధిలోని విద్యుత్ తీగలు తనిఖీ చేయడంతోపాటు అవసరమైన చోట కొత్తవిద్యుత్ లైన్లు వేస్తుంది. గతేడాది ఫిబ్రవరి నుంచే విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ డిమాండ్ ఎంతపెరిగినా అంతరాయాలు తలెత్తకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అందించేలా డిస్కం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో టిఎస్‌ఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫారుఖీ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు విద్యుత్‌తీగలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార మ్మర్ల నిర్వాహణపై స్పెషల్ డ్రైవ్ చేపపట్టారు. లోడ్ ఎక్కువవగా ఉన్న ప్రాంతాల్లో కొత్తడిటిఆర్‌లు ఏర్పాటు చేసి కెపాసిటీ పెంచడంతో పాటు..దాదాపు 1500డిస్టిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అలాగే చెట్లకొమ్మలు వంటివి తొలగించి లైన్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. గ్రేటర్ పరిధిధిలోని 10సర్కిళ్లలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ఫీడర్లను విభజిస్తూ కొత్త ఫీడర్లును అందుబాటులో తెచ్చి వాటి కెపాసిటీని పెంచారు. అవసరమైన చోట 33కెవి, 11కెవి, యుజి కేబుల్, ఏబి కేబుల్‌లను ఏర్పాటు చేశారు. గ్రేటర్ పరిధిలోని వివిధ జోన్‌లలో పరిశీలిస్తే ...మెట్రోజోన్‌లో 716 డిటిఆర్‌లు 36పిటిఆర్‌లను అదనంగా ఏర్పాటు చేశారు. అలాగే కొత్తగా 122 11కెవి ఫీడర్లు, 33కెవి ఫీడర్లు 37 ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా బంజారాహిల్స్,సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మేడ్చల్ జోన్‌లో 1483 డిటిఆర్‌లు, 58పిటిఆర్‌లు, కొత్తగా 187 11కెవి ఫీడర్స్, 33కెవి ఫీడర్లు 28 ఏర్పాటు చేస్తున్నారు.ఇందులో ఎక్కువగా మేడ్చల్, హబ్సిగూడ, సంగారెడ్డి సర్కిళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రంగారెడ్డిజోన్‌లో 1158 డిటిఆర్, 69పిటిఆర్, కొత్తగా 218 -11కెవి ఫీడర్లు, 53 ఫీడర్లు 33కెవి ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా వీటిని సైబర్ సిటీ, సరూర్‌నగర్, రాజేంద్రనగర్ సర్కిళ్లలో ఏర్పాటు చేస్తున్నారు.

**ఈఏడాది 100 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం...**

గతేడాది సమ్మర్‌లో అత్యధికంగా 89.54మిలియన్ యూనిట్లు నమోదు కాగా ఈసారి 100 ఎంయూలు దాటే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ -మేనెలల్లో అత్యధికంగా నమోదైతే ఈసారి మాత్రం మార్చి, ఏప్రిల్ నెలల్లోనే దాన్ని అధిగమించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో ఏప్రిల్ చివరినాటికి 95-100 యూనిట్ల చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా గ్రేటర్‌లోని 10సర్కిళ్లలో 6.50లక్షల విద్యుత్‌కనెక్షన్లు ఉండగా అందులో 5లక్షలకుపైగా గృహవినియోగదారులు ఉన్నారు. ముఖ్యంగా విద్యుత్ వినియోగగంనగర శివారు ప్రాంతల్లో కొత్త ఇండ్ల నిర్మాణంతోపాటు భారీ హౌసింగ్ ప్రాజెక్టులు, పంరిశ్రమల ,వ్యాపార కార్యకలాపాలు పెరుగుతుండటంతో ప్రతిఏడాది గతేడాదికంటే 20శాతం అధికంగా డిమాండ్ పెరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు.

**డిమాండ్‌కు తగ్గట్లు ఏర్పాట్లు : సిఎండీ ముషారఫ్ ఫరూఖీ**

వచ్చే వేసవికాలంలో పెరిగే డిమాండ్‌కు తగ్గట్టుగా తమ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసిందని సిఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈసారి వాతావరణ వల్ల డిమాండ్ గతం కంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందని డిమాండ్ ఎంతగా పెరిగిన దాని తగ్గట్టు సరఫరా అందజేస్తామన్నారు. ముఖ్యంగా శివారు సర్కిళ్లలో అత్యధికంగా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వాటిపై ప్రత్యేకదృష్టి పెట్టినట్లు తెలిపారు.





హైదరాబాద్ వార్త


# సంక్షేమ పథకాల అమలులో ముందువరుసలో ఉండాలి

-అన్నిశాఖలు సమన్వయంతో
పనిచేయాలి
-జిల్లా ఇన్‌చార్జి మంత్రి
పొన్నం ప్రభాకర్



రోడ్‌సేఫ్టీ ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రిపొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన, డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

**హైదరాబాద్,జనవరి 22,ప్రభాతవార్త:** సంక్షేమ పథకాల అమలులో జిల్లాను ముందంజలో ఉంచాలని జిల్లా ఇంచార్జ్‌మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధ్యక్షతన నిర్వహించిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు, పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు నిబద్ధతతో ప్రత్యేక కృషి చేయాలన్నారు. నగర స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక విధానంతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో జనాభావృద్ధి, ఉపాధి కోసం వలసలు, సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థను పరిగణనలోకి తీసుకొని విద్య, ఆరోగ్యం, గృహాలు, రవాణా, భద్రత మరియు ప్రజాసేవలను అధికారులు సమన్వయంతో కలసి అమలు చేయాలని సూచించారు.అలాగే సంక్షేమం, పథకాల అమలు, పింఛన్లు, వృద్ధులు మరియు దివ్యాంగులకు సంబంధించిన సంక్షేమం, 2బిహెచ్‌కే గృహాలు, రేషన్ కార్డులు,సన్నబియ్యం పంపిణీ, విద్యా రంగం, రెసిడెన్షియల్ పాఠశాలలు మరియు హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి వంటి పథకాల అమలును సమీక్షించారు. ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ కవరేజ్, లబ్ధిదారుల పరిధి, ఆసుపత్రుల నెట్‌వర్క్, బస్తీ దవాఖానాలు మరియు ప్రజారోగ్య సౌకర్యాలకు సంబంధించిన అంశాలపై సంబంధిత వైద్యాధికారులు వివరించారు. రవాణా , పట్టణ విస్తరణ అంశాలు, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ సేఫ్టీ చర్యలు, నగరంలోని అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడం, కొత్త బస్ మార్గాల ప్రారంభం ద్వారా కనెక్టివిటీ మెరుగుపరచడం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం అమలు వంటి అంశాలను పరిశీలించారు. అలాగే ఉచిత విద్యుత్ 200 యూనిట్ల సరఫరా, ప్రభుత్వ భూముల సంరక్షణ, మీసేవా కేంద్రాల ద్వారా సులభమైన పాలన ,గ్నేమాపక శాఖల సర్వీస్, బాల కార్మికులు, భిక్షాటన, న్యాయ కేసుల పరిష్కారం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం అంశాలు సమీక్షించి జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేసి అర్హులైన వారికి పథకాలను అందించాలని మంత్రి అన్నారు. అనంతరం ప్రమాదాల నివారణకై ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రోడ్ సేఫ్టీ పై ప్రతిజ్ఞ చేశారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ జితేందర్ రెడ్డి, డిఆర్ వో వెంకటాచారి, సిపిఓ డాక్టర్ సురేందర్, జిల్లా సంక్షేమ అధికారులు జి ఆశన్న, అక్కేశ్వరరావు,ఇలియాస్ అహ్మద్, ప్రవీణ్ కుమార్,కోటాజి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రాండ్ నర్సరీ మేళా ప్రారంభించిన మంత్రి తుమ్మల



గ్రాండ్ నర్సరీ మేళా ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జనవరి 22 ప్రభాతవార్త** ప్రపంచ వ్యాప్తంగా పండే ప్రతీ పంట పండించేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఎన్టీఆర్ మార్గ్‌లోని ఐమాక్స్,అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 19వ గ్రాండ్ నర్సరీ మేళాలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల పండ్ల చెట్లు, పూలచెట్లతో పాటు రైతులు లాభం వచ్చే పంటలను పండించాలని మంత్రి సూచించారు. పచ్చదనాన్ని మరింత విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రంలోని అన్నీ జిల్లా కేంద్రాల్లో నర్సరీ మేళాలు నిర్వహించాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. నర్సరీలకు ప్రత్యేక ప్రోత్సాహం ఇచ్చి హైదరాబాద్‌లోనే కాకుండా పట్టణ వాసులందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రపంచ దేశాల్లో ఏ పంట పండినా ఆ పంటను మన తెలంగాణ రాష్ట్రంలో పండించేందుకు అనువైన వాతావారణం ఉందన్నారు. అకడమియా, ఆర్గానెట్ తదితర అన్ని రకాల పండ్ల చెట్లు, పూలచెట్లతో పాటు రైతులకు లాభం వచ్చే పంటలను రైతులు పండించుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇలాంటి నర్సరీలు రైతాంగానికి, పట్టణ వాసులకు ఉపయోగపడాలన్నారు. ప్రతీ ఏటా పెద్ద ఎత్తున గ్రాండ్ నర్సరీ మేళాను నిర్వహించేందుకు ప్రోత్సహించడం, అదేవిధంగా పండ్లు, పూలమొక్కలు, కూరగాయల మొక్కల నర్సరీలను ప్రోత్సాహించేందుకు హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్ కృషి చేస్తుందన్నారు. హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ ఈ నర్సరీమేళాలో "దేశంలోని అన్ని పూలమొక్కలను అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అన్ని రకాలు ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఫ్లవరింగ్, ఫ్రూట్స్, ఎక్సాటిక్ ప్లాంట్స్ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రైతులకు, పట్టణ ప్రాంతంలో గార్డెనింగ్‌కు అవసరమైన పాట్స్ పాటింగ్ మెటీరియల్ ఇలా అన్ని వససతులకు వన్ స్టాప్ సొల్యూషన్‌గా మేళాలో అందుబాటులో ఉన్నాయన్నారు. బోన్సాయ్ గార్డెన్‌కు సంబంధించి అర్నమెంటల్ మెటీరియ ల్, డెకరేషన్ మెటీరియల్ ప్రదర్శిస్తున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా హర్యానా వెస్ట్ బెంగాల్ వంటి నార్తిండియన్ స్టేట్స్, సౌత్ ఇండియన్ స్టేట్స్ నుంచి అన్ని ప్రదేశాల నుంచి వచ్చి ఈ మే ళాలో ప్రదర్శిస్తున్నారని తెలిపారు.మేళా ఇంచార్జీ ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ .. 26 వ రకు ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటలకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు.

# నగర భవిష్యత్తుకు వికేంద్రీకృత జల నిర్వహణే కీలకం

-జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్




సమావేశంలో మాట్లాడుతున్న జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్,జనవరి 22,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి దీర్ఘకాలిక జల భద్రత, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా వికేంద్రీకృత జల నిర్వహణ కీలకమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పష్టం చేశారు. ఈమేరకు గురువారం సీఐఐ-సోహ్రాబ్జీ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో జీహెచ్‌ఎంసీ-.ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ తో కలిసి "నీటి విడుదల మురుగు నీరు, వర్షపు నీటి నిర్వహణపై స్టేక్‌హోల్డర్ ఇంటరాక్షన్ బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్ నిర్వహించింది.ఈ సమావేశంలో డీసెంట్రలైజ్డ్ వాటర్ మేనేజ్‌మెంట్, మురుగు నీరు, వర్షపు నీటిని పునర్వినియోగం చేసే పద్ధతులపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ రియల్‌ఎస్టేట్ సంస్థలు, ఎన్‌జీవోలు, సాంకేతిక డొమైన్ నిపుణులు పాల్గొని జీహెచ్‌ఎంసీ కమిషనర్, హెచ్‌ఎంఎడబ్ల్యుఎస్‌బీ ఎండీ, ఇతర ఉన్నతాధికారులతో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులు ఇక కేవలం మున్సిపల్ సేవల వినియోగదారులు మాత్రమే కాదని, అవి నీటి ఉత్పత్తి కేంద్రాలు, నిల్వ కేంద్రాలు, పునర్వినియోగ కేంద్రాలుగా కూడా పనిచేస్తాయని తెలిపారు. సక్రమ నిర్వహణ జరిగితే ఇవి భారీ వర్షాల సమయంలో బఫర్లుగా పనిచేసి వరద ముప్పును తగ్గిస్తాయని, నిర్వహణ లోపిస్తే ప్రజామౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాలసీ ఫ్రేమ్‌వర్క్, ఎస్‌టీపీల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, డీసెంట్రలైజ్డ్ వాటర్ మేనేజ్‌మెంట్‌ను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాలు వంటి అంశాలపై చర్చించారు. డ్రెయిన్లపై భారం తగ్గించడం, చెరువులు, నాలాలను పరిరక్షించడం, హైదరాబాద్ నగర దీర్ఘకాలిక పట్టుదలను పెంచడం లక్ష్యంగా ఈ సూచనలను అమలు చేయగల విధానాలుగా మార్చేందుకు ప్రభుత్వం మరింత విస్తృతంగా స్టేక్‌హోల్డర్లతో సంప్రదింపులు జరపనుందని వెల్లడించింది. గత కొన్నేళ్లుగా జీహెచ్‌ఎంసీ స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, సీవరేజ్ వ్యవస్థ బలోపేతం, నాలాల అభివృద్ధిపై భారీగానిధులను వెచ్చించిందని అయితే వేగంగా పెరుగుతున్న నగరీకరణ, మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో కేవలం మౌలిక వసతుల విస్తరణ సరిపోదు.డీసెంట్రలైజ్డ్ విధానంలో నీటిని నిల్వ చేసి పునర్వినియోగం చేయడమే వరద ముప్పుకు మొదటి రక్షణ కవచం అని డెవలపర్లు, ఇండస్ట్రీ లు, ఆర్‌డబ్ల్యుఏలు, ఫెసిలిటీ మేనేజర్లు సమిష్టిగా ముందుకు రావాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పిలుపునిచ్చారు.

## కన్నుల పండువగా సాగిన శాంతి కళ్యాణం



**చిక్కడపల్లి జనవరి 22 ప్రభాతవార్త ) :** ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద వెలసిన శృంగేరి జగద్గురు మహాసంస్థానం శ్రీ పంచముఖ ఆంజనేయ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శాంతి కళ్యాణ మహోత్సవం భక్తుల సమక్షంలో నేత్రపర్వంగా సాగింది. ఆలయ ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్దన మూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో విశేష పూజలతో పాటు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నసమర్పణ జరిగింది. సాయంత్రం వేళ స్వామివారు గరుడ వాహనంపై అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ గరుడోత్సవ సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని పునీతం చేశారు.ఈ ఉత్సవాలలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.కార్యక్రమానికి ముందు ఈ సందర్భంగా ప్రముఖ అధ్యాత్మిక రచయిత పురాణపండ శ్రీనివాస్ సంకలనం చేసిన శ్రీ మాలిక సంపుటి నీ ఆలయ ధర్మాధికారి కళాజనార్థన మూర్తి ఆవిష్కరించారు విశేషం గా భక్తులు పాల్గొనగా ఉచితంగా శ్రీ మాలిక సంపుటి పురాణపండ శ్రీనివాస్ పంపిణీ చేశారు.



## గచ్చిబౌలిలో 2500 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

-ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు




టెలికాంనగర్ పార్కు స్థలం అంటూ బోర్డులు ఏర్పాటు చేసిన ద ృశ్యం

**గచ్చిబౌలి, జనవరి 22 ప్రభాతవార్త**

గచ్చిబౌలిలో కబ్జాకు గురవుతున్న 2500 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు రక్షించారు. పార్కు స్థలాని ్న ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి, కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ వేశారు. దీంతో పాటు పార్కు స్థలం అని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. గచ్చిబౌలిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి టెలికాంనగర్‌లో గల 32ఎకరాల విస్తీర్ణంలో 1982వ సంవత్సరంలో బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు హుడా అనుమతితో లేఅవుట్ చేశారు. కాగా లేఅవుట్ సమయంలో 4వేల గజాలను పార్కు కోసం వదిలిపెట్టారు. కాగా అనంతర కాలంలో కొంతమంది పార్కు స్థలాన్ని ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే 1500 గజాల పార్కు స్థలంలో నిర్మాణాలు వెలువగా, ఉన్న 2500 గజాల స్థలం మీద సైతం కొంత కాలంగా కబ్జాదారులు ఆక్రమించేందుకు ప్రయత్నించసాగారు. సదరు స్థలంలో పాక్షిక నిర్మాణాలు ఏర్పాటు చేసి ప్రహరీగోడలతో కబ్జాకు పాల్పడసాగారు. ఈ విషయమై టెలికాంనగర్ స్థానికులు పార్కు ఆక్రమణపై హైడ్రాకు పిర్యాదు చేశారు. కాగా హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు టెలికాంనగర్‌లో దర్యాప్తు చేపట్టిన హైడ్రా అధికారులు పార్కు స్థలం కబ్జాకు గురవుతున్నట్లు గుర్తించారు. ఈమేరకు గురువారం జెసిబిలతో సదరు స్థలంలో ఉన్న పాక్షిక నిర్మాణాలను నేలమట్టం చేసిన హైడ్రా అధికారులు, పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు పార్కు స్థలం అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. మరోసారి పార్కు స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# నేడు నార్సింగిలో 'పశు సంక్రాంతి' ఉత్సవం

- 15 రాష్ట్రాల నుంచి
సంతకు రానున్న
రైతులు,గేదెల వ్యాపారులు
- శతాబ్దాల నుంచి ఇక్కడ
కొనసాగుతున్న గేదెల జాతర



నార్సింగి గ్రామంలో పశుసంక్రాంతి ఉత్సవానికి ముస్తాబైన గేదెల దృశ్యం.

**నార్సింగి, జనవరి 22 ప్రభాతవార్త :** సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే శుక్రవారం నాడు "పశు సంక్రాంతి" ఉత్సవాన్ని జరుపడం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి గ్రామంలో శతాబ్దాల కాలం నుంచి ఆనవాయితీగా వస్తుంది. ప్రతిఏటా ఈ పశు సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరిపేందుకు స్థానిక యాదవ సోదరులు, నార్సింగి మార్కెట్ కమిటీ పాలకులు, అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తారు. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలంలోని నార్సింగి గ్రామంలో కులీ కుతుబ్‌షాహీల కాలం నుంచి పశు సంక్రాంతి (గేదెల జాతర) కొనసాగుతూ వస్తోంది. ఈ సంతలో ఒక్కో గేదె రూ.2,లక్షల వరకు పలుకుతుండడం విశేషం. ఈ గేదెల జాతరలో దేశంలోని 15. రాష్ట్రాల నుంచి రైతులు, డైరీఫాంల యజమానులు, వ్యాపారులు తమ గేదెలు, దున్నపోతులను అందంగా అలంకరించి భాజా,బజంత్రీల మధ్య ఊరేగిస్తారు. అనంతరం ధర పలికితే అమ్మడం, కొత్తజాతి గేదెలను కొనడం చేస్తుంటారు. ఈ ఒక్కరోజు జరిగే పశు సంక్రాంతి ఉత్సవంలో రూ. కోట్లల్లో వ్యాపారం జరుగుతుంటుంది. ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యాపారులు వందల సంఖ్యలో గేదెలను నార్సింగి సంతకు తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయానికి మరిన్ని గేదెలు వచ్చే అవకాశం ఉంది.

**ఎప్పటి నుంచి అంటే :** గోల్కొండను పాలించిన కులి కుతుబ్‌షాహీ రాజుల కాలంలో నార్సింగి గ్రామంలో ప్రతి శుక్రవారం పశువుల సంత కొనసాగేది. ఈ ప్రత్యేక సంత మాత్రం ఏటా సంక్రాంతి పండుగ తర్వాత మొదటి శుక్రవారం జరుగుతుంది. నాటి సంప్రదాయం నేటికీ కొనసాగుతూ వస్తోంది. ఉత్తర, దక్షిణ భారతానికి మధ్యలో హైదరాబాద్ ఉండడంతో పశువుల మేళాకు ఆదరణ ఎక్కువగా ఉంటోంది. ఈ మార్కెట్‌ను రైతులు పెద్ద సంత, బడా బజార్, పశు సంక్రాంతిగా పిలుస్తుంటారు.

**ఎక్కడెక్కడి నుంచి పశువులు వస్తాయంటే :** నగరం చుట్టు ఉన్న రంగారెడ్డి, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు. ఒంగోలు, కృష్ణా జిల్లాలు, తమిళనాడు, కర్ణాటక, మహారా ష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, గుజరాత్, పంజాబ్, హార్యాన, ఉత్తరప్రదేశ్, బీహార్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి నార్సింగి పశు సంక్రాంతి సంతకు గేదెలు,ఆవులు, మేకలు వస్తాయి. మార్కెట్‌ను మాత్రం పంజాబ్, హార్యానా, గుజరాత్ గేదెలే డామినేట్ చేస్తాయి. క్రయ విక్రయాలలో అవే ప్రధాన భూమికను పోషిస్తాయి. ఒక్కో గేదే రూ.50వేల నుంచి మొదలుకొని రూ.2.లక్షల వరకు ధర పలుకుతుంది. పశువులను అలంకరించే వస్తువుల ధరలు కూడా భారీగా పెరుగుతాయి. ఇప్పటికే ఈ దుకాణాలు పది వరకు నార్సింగి మార్కెట్‌లో వెలిశాయి. ఈ పశు సంక్రాంతిలోని మేలురకమైన గేదెలు, ఆవులు, మేకలను చూసేందుకు, కొనేందుకు గతంలో ఏంపీలు బండారు దత్తాత్రేయ, ఆంజన్‌కుమార్ గౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలు వచ్చారు. ఈ సారి సైతం నగర శివారుల్లోని పెద్ద పెద్ద డైరీలు నిర్వహించే వారు పశు సంక్రాంతిలో పాల్గొని మేలు రకమైన గేదెలను తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

**భారీ ఏర్పాట్లు చేశాము : నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్**

నేడు నార్సింగిలో జరుగనున్న పశు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఈ సంవత్సరం భారీ ఏర్పాట్లు చేశామని నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్ పేర్కొన్నారు. ఆవులు, గేదెలు, మేకలకు ప్రత్యేకంగా షెడ్లు, మేత, నీటి తొట్టెలు ఏర్పాటు చేయించామని తెలిపారు. అలాగే రైతులు, పశువుల వ్యాపారుల కోసం కూడా విశ్రాంతి, వసతి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నార్సింగి పశువుల సంతను మరింత ఆధునీకరించి, అభివృద్ధి చేసి దేశ వ్యాప్తంగా మంచి పేరు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ కోట వేణుగౌడ్ వివరించారు.

### వాయునాణ్యత మెరుగుపరిచేందుకు కలిసికట్టుగా పనిచేయాలి
## అదనపు కమిషనర్ రఘు ప్రసాద్




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** వాయు నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ శాఖలు, విభాగాలు కలిసి కట్టుగా పనిచేయాలని అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ అన్నారు. ఈమేరకు గురువారం జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం అమలు వేగవంతం చేయడంలో భాగంగా జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సిటీ లెవల్ మానిటరింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈసమావేశంలో జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ నగరంలో గాలి కాలుష్య నియంత్రణకు సంబంధించిన విభాగాల పనితీరును సమీక్షించారు. హాట్ స్పాట్‌ల వారీగా వాయు నాణ్యత పరిస్థితులు, ప్రస్తుత అమలు స్థితి, రోడ్డు ధూళి నియంత్రణ, వాహన కాలుష్యం తగ్గింపు, పరిశ్రమలు సిఎండ్‌డి వేస్ట్ కార్యకలాపాలు వంటి అంశాలను విశ్లేషించారు. నగరంలో కాలుష్యాన్ని కనీస స్థాయికి తగ్గించి వాయు నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈసమావేశంలో ఎస్‌డబ్ల్యుఎం విభాగం సెంట్రల్ పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్ టెక్నికల్ కన్సల్టెంట్ సుధాకర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 25న ఓటు హక్కు వినియోగంపై అవగాహన




పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుభాష్ అగర్వాల్, ప్రమోద్‌కుమార్, ఈశ్వర్‌బట్,శ్రీనివాసన్ తదితరులు

**హైదరాబాద్,జనవరి 22,ప్రభాతవార్త:** ఓటు హక్కు వినియోగంపై ఈనెల 25న నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా సుందరయ్య పార్కు వద్ద ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలంగాణ ప్రవాసి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సుభాష్ అగర్వాల్ తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఓటు హక్కు వినియోగం పై సామాన్య ప్రజలకు వివరించి వారి ఓటును సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు వేసే ఒక్క ఓటు ఐదు సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయిస్తుందని ఓటు వినియోగంపై ప్రజల్లో అవగాహన ఇంకా రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనరల్ అజయ్ మిశ్రా, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్నాల్ హాజరవుతారని తెలిపారు.కార్యక్రమంలో ప్రవాసి సమాజ్ నాయకులు ప్రమోద్ కుమార్ ఈశ్వర్ బట్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

### జలమండలి ఎటిఓగా సయ్యద్ అక్తర్ అలీకి పదోన్నతి



పదోన్నతి పొందిన సయ్యద్ అక్తర్ అలీని సన్మానిస్తున్న జలమండలి ఉద్యోగులు

**చాంద్రాయణగుట్ట, జనవరి 22, ప్రభాతవార్త :** జలమండలి ముస్లీం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) ప్రధాన కార్యదర్శి సయ్యద్ అక్తర్ అలీని అలియాబాద్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఉద్యోగులు, అసోసియేషన్ ప్రతినిధులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సయ్యద్ అక్తర్ అలీ అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ (ఏటీఓ)గా పదోన్నతి పొందారు. భవిష్యత్‌లో మరిన్ని పదోన్నతలు పొందుతూ ఉద్యోగిగా, యూనియన్ నాయకుడిగా మరింత పేరు తెచ్చుకోవాలని ఉద్యోగులు ఆకాంక్షించారు.

**డీజీఎంగా చంద్రుకు పూర్తి బాధ్యతలు....**

అలియాబాద్ సబ్ డివిజన్ తాత్కాలిక డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం)గా విధులు నిర్వహిస్తున్న చంద్రుకు పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగిస్తూ జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన సబ్ డివిజన్ డిజీఎంగా పూర్తి స్థాయి బాధ్యతలతోపాటు జంగమ్మెట్ సెక్షన్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. సబ్ డివిజన్‌లోని సెక్షన్ మేనేజర్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఉద్యోగులు గురువారం డీజీఎం చంద్రును శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు రమేష్, నరేష్, టీజీఐఐలు మహ్మద్ అన్వర్, సర్వేశ్వర్, ఉద్యోగులు యూసుఫ్, మహ్మద్ సలీమ్, ముక్రం, పెంటయ్య, పర్వతాలు, రామకృష్ణ, వెనేష్, సల్మాన్, మహ్మద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

### గుట్టలో బ్రహ్మోత్సవ వైభవం.... తరలివచ్చిన భక్తజనం



అగ్ని భగవానునికి యజ్ఞ ద్రవ్యాలు సమర్పిస్తున్న నిర్వాహకులు, భక్తులు

**చాంద్రాయణగుట్ట, జనవరి 22, ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్ట శ్రీ దేవి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు గురువారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఛండీ యజ్ఞం తదితర పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ ఆధ్వర్యంలోని అర్చక స్వాముల బృందం శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం 12 గంటలకు మాతృమూర్తులచే సామూహిక కుంకుమార్చన పూజను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహిళలు ఒడి బియ్యం, మొక్కులు సమర్పించుకున్నారు. ఆ తరువాత అమ్మవారికి మహా హారతి ఇచ్చారు. సమీప బస్తీల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జగదాంభ మాతను దర్శించుకున్నారు. దొడ్డ వజ్ర కుమార్ కుటుంబ సభ్యులచే భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. రాత్రి జరిగిన మహా హారతికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. ఆలయ అర్చకులు విఠల్ కుమార్ కార్వాంకర్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చివరి రోజు 23వ తేదీ శుక్రవారం, అమ్మవారికి ప్రీతి పాత్రమైన వసంత పంచమి రోజున ఉదయం అభిషేకం, ఛండీ యజ్ఞం, పూర్ణాహుతి, మంత్ర పుష్పాం జలి, సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారి భవ్య ఊరేగింపు ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మా భవానీ అనుగ్రహానికి పాత్రులు కాగలరని ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ కోరారు.

## క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మృతి

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** నగర శివారు ప్రాంతమైన అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కవాడిపల్లి గ్రామపంచాయతీ మూడో వార్డు సభ్యుడు బండారి సురేశ్(25) గురువారం హఠాన్మరణం చెందారు. హయత్‌నగర్ కుంట్లూరు సమీపంలోని బీబీఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో సురేశ్ పాల్గొన్నాడు. క్రికెట్ ఆడుతుండగా ఛాతీలో నొప్పిరావడంతో అస్వస్థతకు గురయ్యారు. ఇంటికెళ్లిన తర్వాత నొప్పి తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

## 28నుంచి బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ఇండియా ఎయిర్ షో

*-నాలుగు రోజుల పాటు వ్యాపార సదస్సులు, ప్రదర్శనలు*

*-భారీగా తరలిరానున్న సందర్శకులు.దేశ విదేశాల ప్రతినిధులు*

**బేగంపేట జనవరి 22,ప్రభాతవార్త**

రెండేళ్లకు ఒక సారి ఆసియాలోనే అతిపెద్ద దైన వింగ్స్ ఇండియా ఎయిర్ షో 2026కు మరో మారు బేగంపేట విమానాశ్రయం వేదిక కానుంది.దీనికోసం బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. వింగ్స్ ఇండియా 2026 ఎయిర్ షో కు సంబంధించిన వివరాలను వెల్లడించేలా బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. విమానాశ్రయం మొత్తంతో పాటు బయట కూడా సమాచారాన్ని తెలియజెప్పేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నెల 28నుంచి 31 వరకు బేగంపేట విమానాశ్రయంలో అంతర్జాతీయ ప్రదర్శన,సదస్సులు జరగనున్నాయి.ఈ మేరకు పౌర విమానయాన శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. భారతీయ విమానయానం అనే ఇతి వృత్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.డిజైన్,విస్తరణ,తయారీ నుంచి నిర్వహణ,భద్రత నుంచి స్థిరత్వం అనే అంశాలపై ఈ కార్యక్రమం సాగనుంది.కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ షో ప్రారం భోత్స వ కార్యక్రమంలో పాల్గొననున్నారు.20కి పైగా దేశాలకు చెందిన నిపుణులు ,పౌర విమానయాన సంస్థల ఉన్నతాధికారులు,మంత్రులతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొననున్నారు.ఈ ప్రదర్శనకు వచ్చే వివిధ దేశాల ప్రతినిధులు వారి ప్రాంతాల్లో పెట్టుబడి అవకాశాలు,మౌలిక సదుపాయాల గురించి వివరించనున్నారు.మొదటి రోజు గ్లోబల్ సీఈఓ ఫోరం జరగనుంది. అనంతరం పలు అంశాలపై రౌండ్ టేబులు సమావేశాలు,ప్యానెల్ చర్చా కార్యక్రమాలు జరగనున్నాయి.

ముఖ్యంగా ఈ సదస్సులో ఎయిర్ కార్గో రవాణా,బిజినెస్ ఏవియేషన్ ,విమాన విడి భాగాల తయారీ రంగంలో ఉన్న అవకాశాలు పర్యావరణ అనుకూల విమానయాన రంగంతో పాటు వివిధ అంశాలపై చర్చించనున్నారు.గత ఏవియేషన్ షో లో ఎయిర్ షో వీక్షకులను ఎంతగానో ఆకర్షించేలా చేయడంతో ఈ ఏడాది భారీగా ఎయిర్‌షోకు సందర్శకులు వచ్చే అవకాశం ఉంది.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించేలా ప్రభుత్వాన్ని ఒప్పించడం అభినందనీయం




బండి రమేష్‌ను సన్మానిస్తున్న తండా వాసులు

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 22, ప్రభాతవార్త :** ఫతేనగర్ డివిజన్ అమృత్ నగర్ తండావాసుల 40 ఏళ్ల స్వప్నం సాకారం కాబోతుంది. ఇక్కడ నివసిస్తున్న ఎస్‌సి, ఎస్‌టీ నివాసితులకు పట్టాలు మంజూరు చేసి కైతలాపూర్ దగ్గర్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వ నుంచి బుధవారం శుభవార్త అందింది. దీంతో ఈ తండావాసుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ప్రజాసమస్యల పరిష్కారంలో భాగంగా గత నవంబర్‌లో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్ ఈ తండాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు తండావాసులు తాము ఇక్కడ 40 ఏళ్లుగా ఉంటున్నామని ఎలాంటి సౌకర్యాలు లేవని రోడ్లు తాగునీరు వంటి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని రమేష్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత సలహాదారు వేం నరేంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. దీంతో అధికారులు ప్రకటించారు. ఇళ్లలో చిన్న చిన్న మరమ్మతులు చేయాల్సి ఉందని వాటిని పూర్తి చేసిన వెంటనే వాసులను ఇక్కడికి తరలించి వారికి అవసరమైన ధ్రువపత్రాలను అందజేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. తమ సమస్యను ఎన్నో ఏళ్లుగా గత ప్రభుత్వం దృష్టికి స్థానిక శాసనసభ్యుడికి చెప్పుకున్నా ఎలాంటి స్పందన లేదని తమ బస్తీని సందర్శించిన కేవలం రెండు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయింపజేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించడం చాలా ఆనందంగా ఉందని తండావాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, ఫతేనగర్ డివిజన్ ప్రెసిడెంట్ కుక్కల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హమీద్, శివ చౌదరి, అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛందంగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి
**- నార్సింగి ట్రాఫిక్ ఎస్ఐ రాజేష్‌గౌడ్**



నార్సింగిలోని డీమార్ట్ సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్.ఐ రాజేష్‌గౌడ్.

**నార్సింగి, జనవరి 22 ప్రభాతవార్త :** వాహనదారులంతా స్వచ్ఛందంగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని నార్సింగి ట్రాఫిక్ ఎస్.ఐ రాజేష్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం నార్సింగిలోని డీమార్ట్ ఉద్యోగులు, సిబ్బంది అందరికి " నేషనల్ రోడ్ సేఫ్టీ అరైవ్ అలైవ్" కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లు తోలేవారు సీటుబెల్టులు ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. అలాగే డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపైకి వచ్చే వారు తమ వెంట డ్రైవింగ్ లైసెన్సు, ఆర్.సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితర డాక్యుమెంట్లు తీసుకు రావాలన్నారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ పార్కింగ్, వ్యతిరేక దిశలో వాహనాలు నడుపడం, అధిక లోడుతో, అధిక స్పీడుతో వాహనాలు తోలడం, మద్యం సేవించి వాహనాలు నడుపడం చట్టరీత్యా నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు మన బాగు కోసం మనం ఏర్పాటు చేసుకున్నామని, అందరం వాటిని పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి చట్టపరిధిలో చలానాలు, అవసరమైతే జైలుశిక్షలు కూడా వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీమార్ట్ ఇంచార్జి లోకేష్, ట్రాఫిక్ పోలీసులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం : ఎమ్మెల్యే ముఠా గోపాల్




రాంనగర్ లో పెద్ద ప్రజలకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి జనవరి 22 ప్రభాతవార్త :** పేద ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం రాంనగర్ లో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో షారోన్ చర్చి ఆవరణలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై, శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ శిబిరంలో సుమారు 18 రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జయసింహ కార్యక్రమ నిర్వాహకులు కృపావరం, పాస్టర్ ప్రేమ్, పాస్టర్ అనిల్, బీఆర్ఎస్ నేతలు శంకర్ ముదిరాజ్, గోక నవీన్, ముదిగొండ మురళి, ముచ్చకుర్తి ప్రభాకర్ , ఇతర ముఖ్య నాయకులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

### రచయితలు రాణించాలంటే సమాజాన్ని, సాహిత్యాన్ని చదవాల్సిందే : డా. గంద్ర లక్ష్మణరావు

**నాంపల్లి, జనవరి 22 ప్రభాతవార్త :** రచయితలు, ముఖ్యంగా నవరచయితలు సమకాలీన సమాజాన్ని, సాహిత్యాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని రచనలు కావిస్తేనే రాణించగలరని, తమదైన భాష, శైలి ప్రయోగించాలని ప్రముక సాహితీవేత్త డా. గంద్ర లక్ష్మణరావు సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం రాత్రి డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో ఘనంగా జరిగి పరిణతవాణి 123వ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రచయితలకు అధ్యయనం తప్పనిసరి అని, మూలగ్రంథాలను చదవాలని, ఎవ్వరినీ అనుకరించరాదని స్పష్టం చేశారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో డా. లక్ష్మణరావు పద్యకవిగా, విశ్వనాథ వేయిపడగలు నవలపై ప్రామాణిక పరిశోధన చేసిన విద్వాంసునిగా, విమర్శకునిగా, అవధానిగా సాహితీరంగంలో లబ్ధప్రతిష్టులయ్యారని వివరించారు. పరిషత్తు ఇప్పటివరకు తెలుగు ప్రముఖుల పరిణతవాణి ప్రసంగాలను 12 సంపుటాలుగా ముద్రించి అందరికీ అందుబాటులో ఉంచిందని గుర్తుచేశారు.

### ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు గొప్ప ఆయుధం



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న రుద్రరాజు, మోహన్‌రావు, శంకరనారాయణ, శ్రీరామ్ తదితర ప్రముఖులు

**నాంపల్లి, జనవరి 22 ప్రభాతవార్త :** నేరచరితులు రాజకీయాల్లోకి రావడం, ధనస్వామ్యంగా మారుతున్న ప్రజాస్వామ్య రక్షణకు ఓటుహక్కు గొప్ప ఆయుధం వంటిదని గిడుగు రుద్రరాజు, ప్రొఫెసర్ మోహన్‌రావులు అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసి వారు మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ఓటుహక్కును తప్పక వినియోగించుకుని గ్రామస్థాయి నుండి కేంద్ర రాష్ట్ర స్థాయిల వరకు అర్హులైన నిజాతీపరులైన ప్రజాసేవకులను ఎన్నుకోవాలని సూచించారు. ప్రముఖ హాస్యచక్రవర్తి శంకర నారాయణ ప్రకాశం పంతులు వంటి నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని, అలాంటి వారికి భారతరత్న అవార్డు ప్రదానం చేయాలని సూచించారు. టంగుటూరి వంశీకుడు శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అథఃపాతాళంలో కూరుకుపోతున్న తరుణంలో ప్రకాశం పంతులు వంటి నాయకుల్ని ఎన్నుకోవడం ప్రభంజనం సృష్టించారన్నారు. న్యూసైన్స్ కాలేజీ సెక్రటరీ జైకిషోర్, ఉపాధ్యక్షుడు ఆనందసూర్యలు ఓటుహక్కుతో మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌దేశాయ్, రాధాకృష్ణ, లక్ష్మీనరసింహ, రామ్మోహన్‌రెడ్డి, హనుమంతరావు, రాజశేఖర్, విద్యాసాగర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ముందుగా అతిథులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. ప్రొఫెసర్ అర్చన, అలేఖ్యలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సంక్రాంతికి ఊరెళ్లిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీకి విఫలయత్నం

**గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మొదటి స్పాట్ ఎఫ్ఐఆర్ నమోదు**



స్పాట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితురాలికి అందజేస్తున్న పోలీసులు

**గచ్చిబౌలి, జనవరి 22 ప్రభాతవార్త**

సంక్రాంతికి స్వస్థలానికి వెళ్లిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఇంట్లో చొరబడిన దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ చోరీ ప్రయత్నంలో ఇంట్లో నుంచి ఎటువంటి వస్తువులు పోకపోవడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఊపిరిపీల్చుకుంది. కాగా బాధితురాలి పిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు మొదటి స్పాట్ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇన్స్‌పెక్టర్ బాలరాజు కథనం ప్రకారం... గచ్చిబౌలిలోని జిపిఆర్ఏ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న జి.చందన శ్రీ(25) స్థానికంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తుంది. కాగా సంక్రాంతి పండుగ కోసం తన స్నేహితులతో కలిసి చందన శ్రీ ఈనెల 11వ తేదీన స్వస్థలానికి వెళ్లి తిరిగి 19వ తేదీన తన ఇంటికి తిరిగి వచ్చింది. తన ఫ్లాట్ తాళం పగులగొట్టి ఉండగా, ఇంట్లోకి వెళ్లి చూస్తే ఇంట్లో ఉన్న బీరువా తాళాలు సైతం పగులగొట్టి, బట్టలు, సామాగ్రి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కాగా ఇంట్లో నగదు, ఆభరణాలు లేకపోగా, దొంగలు ఎటువంటి సామాగ్రిని సైతం చోరీ చేయలేదు. దీంతో చందన శ్రీ పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు చందన శ్రీ వద్ద నుంచి ఇంటి వద్దే పిర్యాదు తీసుకొని స్పాట్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ చేపట్టి, సిసి కెమెరాలను పరిశీలించగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. ఈమేరకు గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కంటోన్మెంట్ భూములపై న్యాయవిచారణ చేయాలి : గడ్డం ఎబెల్




సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం ఎబెల్, విశాల్ చైతన్య, మన్సూర్ అలీ తదితరులు

**హైదరాబాద్,జనవరి 22,ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్లోని భూములపై భారత ప్రభుత్వానికి చట్టబద్ధమైన యాజమాన్యం లేదని జనతా కాంగ్రెస్ పార్టీ (జేసీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం ఎబెల్ ఆరోపించారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చారిత్రక వాస్తవాలు, రాజ్యాంగ నిబంధనలు కేంద్రం వాదనలకు మద్దతు ఇవ్వడం లేదని తెలిపింది.విలేకరుల జేసీపీ ప్రకారం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సార్వభౌమ హైదరాబాద్ రాజ్యంలో స్థాపించబడింది అది ఎప్పుడూ బ్రిటిష్ ఇండియాలో భాగం కాదన్నారు. బ్రిటిష్ తదనంతరం కేంద్ర ప్రభుత్వానికి భూమిని స్వాధీనం చేసుకోవడం, అమ్మకం లేదా చట్టబద్ధంగా బదిలీ చేయడం జరగలేదని, ఆ ప్రాంతంలో బ్రిటిష్ సైనిక ఉనికి కేవలం అనుమతితో కూడుకున్నదే తప్ప, అది యాజమాన్య హక్కులను కల్పించలేదని తెలిపారు. 1906లో కేవలం పరిపాలనా సౌలభ్యం కోసమే అనేక జాగీర్ గ్రామాలను కంటోన్మెంట్ పరిధిలో విలీనం చేశారని, అయితే ఈ విలీనం భూ యాజమాన్యాన్ని మార్చలేదని, ఆ భూములు జాగీర్దార్లు, ప్రైవేట్ వ్యక్తులు ,హైదరాబాద్ సంస్థానం ఆధీనంలోనే కొనసాగాయనిపేర్కొన్నారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూ మాఫియా, కొందరు అధికారులు,రాజకీయ నాయకుల ప్రమేయంతో కంటోన్మెంట్ పౌర ప్రాంతాలలో పెద్ద ఎత్తున అక్రమంగా భూములను ఆక్రమించుకుంటున్నారని వాటిపై న్యాయవిచారణ చేయాలన్నారు.ఈకార్యక్రమంలో పార్టీనేతలు విశాల్ చైతన్య, మైనారి సెల్ వైస్ ప్రెసిడెంట్, మన్సూర్ అలీ,దీపక్ శర్మ, సర్వేందర్, రవీందర్ నాయుడు, టి.నరేష్‌పాల్గొన్నారు.

## ఆనందగల్లీలో విరిగిపోయిన డ్రైనేజీ మూత.. ఇబ్బందుల పాలవుతున్న ప్రజలు



ఆనందగల్లీలో విరిగి పోయిన డ్రైనేజీ మూత కప్పు

**చార్మినార్,జనవరి 22 ప్రభాతవార్త :** ఆనందగల్లీలోని డ్రైనేజీ మూత కప్పు విరిగి పోయి లోపలకు కూరుకు పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. పాదచారులు, వాహనదారులు ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడిపోయే అవకాశం ఉన్నప్పటికి జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కులీకుతుబ్‌షా స్టేడియంను ఆనుకుని ఉన్న ఆనందగల్లీలో వందలాది ఇండ్లు ఉన్నాయి.ఆనంద గల్లీ బ్రిబీ హల్వా రహదారిలో ఉన్న డ్రైనేజీ మూత కప్పు విరిగి పోయి కిందికి కూరుకు పోయింది.రాత్రి వేళల్లో చీకటిలో పాదచారులు,మహిళలు రహదారిలో ఉన్న డ్రైనేజీ ప్రక్క నుంచి నడిచి వెళ్లాలంటనే భయపడుతున్నారు.నిత్యం ఈ రోడ్డు వెంబడి వేలాది వాహనాలు నడుస్తుంటాయి,వాహనాలు ఎప్పుడు అదుపు తప్పి డ్రైనేజీలో పడిపోతాయని వాహనదారులు భయపడుతున్నారు.డ్రైనేజీ మూత కప్పును తొలగించి కొత్త మూత కప్పు వేయాలని పలు మార్లు జిహెచ్ఎంసి అధికారులకు మొరపెట్టుకున్నప్పటికి ఎటువంటి ఫలితం లేక పోయిందని ఆనందగల్లీ వాసులు తమ విచారాన్ని వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆనందగల్లీలో డ్రైనేజీకి మూత కప్పును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### వైజ్ఞానిక ప్రదర్శనలతో దేశ పురోగతి : కొల్లి మాధవి

**కుత్బుల్లాపూర్, జనవరి 22 ప్రభాతవార్త**

భారతదేశ వైజ్ఞానిక పరిశోధనలు ప్రపంచానికి ఆదర్శ ప్రాయంగా మారాలంటే బాల్యం నుండే పునాది ఏర్పడేలా ప్రోత్సహించాలని భారతీయ జనతాపార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి విజ్ఞప్తిచేశారు. గురువారం చింతల్ హెచ్ఎంటి గ్రౌండ్స్‌లోగల వాక్సన్ ఇంటర్‌నేషనల్ స్కూల్ లో నిర్వహించిన స్టీమ్‌వేర్స్-25 ఇంగ్లీష్‌ఆర్ట్స్ మాథమెటిక్స్ వైజ్ఞానిక ప్రదర్శనకు పాఠశాల కరస్పాండెంట్ వనజాఅశోక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు రూపొందించిన సాటిలైట్‌ల నమూనాలతో పాటు విద్యార్థులు రూపొందించిన వివిధ వైజ్ఞానిక నమూనాలను ఆమె పరిశీలించి అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం శాస్త్ర, సాంకేతిక రంగాలలో మరింత పరిశోధనల అవసరం వుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ వనజాఅశోక్ మాట్లాడుతూ తమ పాఠశాల ప్రారంభంనుండే విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో అన్నిరంగాలలో శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. విశాల మైదానంతో పాటు ప్రతివిద్యార్థిపై ప్రత్యేక శ్రద్దతో వారికి ఆసక్తిగల రంగాలను గుర్తించి అందుకు అనుగుణంగా శిక్షణలో ప్రత్యేకదృష్టి సారించినట్లు తెలిపారు.ఈసందర్భంగా భారతీయ జనతాపార్టీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సుమన్‌రావు, బాచుపల్లి అధ్యక్షులు ప్రసాదరాజు, ప్రగతినగర్ శాఖ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, కార్తీక్‌లతోపాటు వాక్సన్ ఇంటర్‌నేషన్ స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రదర్శనలను వారి పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు.

### సాధ్యమైనంత తక్కువ నష్టం జరిగేలా స్టీల్ బ్రిడ్జి పనులు చేపట్టాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**పేట్ బషీరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త**

సాధ్యమైనంత తక్కువ నష్టం జరిగేలా స్టీల్ బ్రిడ్జి పనులను చేపట్టాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులను ఆదేశించారు. గురువారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుభాష్ నగర్ పైప్ లైన్ రోడ్ స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం కారణంగా నష్టపోతున్న బాధితులతో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యం కలిగేలా బ్రిడ్జ్ నిర్మాణ పనులను చేపడుతూనే స్టీల్ బ్రిడ్జి కారణంగా నష్టం జరుగుతున్న వారికి సాధ్యమైనంత నష్టనివారణ తగ్గేలా సాధ్యా సాధ్యాలను పరిశీలించి అందుకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోన్ హెచ్ సిటి విభాగం చీఫ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హెచ్ ఎండబ్ల్యుఎస్ ఎస్బి ట్రాన్స్మిషన్ డీజీఎం, నిర్మాణ సంస్థ, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ల జంగయ్య సేవలు మరువలేనివి



ఎడ్ల జంగయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**చార్మినార్,జనవరి 22 ప్రభాతవార్త :** హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ మందిరం మాజీ కోశాధికారి ఎడ్ల జంగయ్య 18వ వర్ధంతి గురువారం ఘనంగా జరిగింది.ఎడ్ల జంగయ్య విగ్రహానికి రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ జి.నిరంజన్‌తో పాటు పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.మందిరం అభివృద్ధి కోసం ఎడ్ల జంగయ్య చేసిన సేవలు మరువ లేనివని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి అధ్యక్షులు ప్రభాకర్,ప్రతినిధులు రాందేవ్ అగర్వాల్,జగన్మోహన్ కపూర్,జి.రాజారత్నం,ఎం.కృష్ణ,కె.దత్తాత్రేయ,జి.కన్నయ్యలాల్,కె.రమేష్,జి.శ్రీను,చేతన్ సూరి,పెద్దోజు రవీంద్రచారి, ఎం.విజయ్ కుమార్,జి.మెకానిక్ రాజు,దేవాలయం కమిటి కోశాధికారి ఎడ్ల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## రోడ్లపై అసభ్య కార్యకలాపాలు

**-8 మంది హిజ్రాల బైండోవర్**

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** రహదారులపై అసభ్య కార్యకలాపాలకు పాల్పడుతున్న హిజ్రాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్, చైతన్యపురి ప్రధాన రహదారులు, రోడ్లపై అసభ్యకరంగా వ్యవహరిస్తున్న 8 మంది హిజ్రాలను తమ పోలీస్ సిబ్బంది అరెస్టు చేశారని తెలిపారు. వాహనాలకు అడ్డంగా వెళ్లి ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించడంతోపాటు రోడ్డుపై వెళ్తున్న పాదాచారులను వెంబడించి అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమాచారం తెలియడంతో తమ పోలీస్ సిబ్బంది 8 మందిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. అరెస్టు చేసిన వారిని సరూర్‌నగర్ తహసిల్దార్ వేణుగోపాల్ దగ్గర బైండోవర్ చేయడం జరిగింది అన్నారు. అక్కినపల్లిన్, రిషిత, మస్కాన్ యాదవ్, ప్రీతి, బిందు, అమూల్య, షరీన్, ఆద్య అనే 8 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎటువంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సైదులు హెచ్చరించారు.

### ఆటోను ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరి మృతి

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** ఆటోను ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బసవరాజు సిద్దులు(34) కుంట్లూరు హాట్స్, రావినారాయణరెడ్డినగర్ కాలనీలో నివాసం ఉంటాడు. సిద్దులు ఎప్పటిలాగే 21వ తేదీ ఉదయం ఆటోలో మేస్త్రి పనికి వెళ్లాడు. పని పూర్తిచేసుకున్న అనంతరం అదే రోజున సాయంత్రం ఏపీ24డబ్ల్యూ3811 నంబర్ గల ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా రావినారాయణరెడ్డినగర్ వైపు వెళ్తున్న సమయంలో భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గౌరెల్లి వైపు నుండి టీఎస్08యుఏ6965 నంబర్ గూడ్స్ఆటో అధికవేగంతో నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి సిద్దులు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన సిద్దులు, అదే ఆటోలో ఉన్న నర్సింహారావును వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా వైద్యులు పరిశీలించి సిద్దులు అప్పటికే మరణించాడని ధ్రువీకరించారు.ఈ ప్రమాదం పూర్తిగా గూడ్స్ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య ప్రవళిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి..ఇద్దరికి తీవ్ర గాయాలు

**కుత్బుల్లాపూర్, జనవరి 22 ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ చౌరస్తావద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా మరో బాలుడు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిదిలో చోటుచేసుకుంది. జీడిమెట్ల సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌సాగర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన ఇరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి(23) తనటెంపో వాహనంపై శుక్రవారం రాత్రి 08.30 సమయంలో షాపూర్ నగర్ నుండి చింతల్ వైపుతన టెంపోహనంపైతన కుమారుడు దిలీప్‌రెడ్డితో కలిసి వస్తున్నాడు. ఇదేసమయంలో రోడ్డుపైడు ఉన్న చెట్టుకు వాహనం బలంగా ఢీకొట్టింది. దీనితో విష్ణువర్ధన్‌రెడ్డికి తీవ్రగాయాలు అయి అక్కడికి అక్కడే మృతిచెందాడు. తనపక్కనే కూర్చున్న దిలీప్‌రెడ్డికి కూడా గాయాలుకావడంతో ఆతనిని వెంటనే మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడికి అక్కడే మృతిచెందిన విష్ణువర్ధన్‌రెడ్డిని పరీక్షల నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు. ఈమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 270 మందికి జైలు శిక్ష

**హైదరాబాద్, జనవరి 22 ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో, రోడ్డు భద్రతను పెంపొందించడం, ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరవ్యాప్తంగా 'డ్రంక్ అండ్ డ్రైవ్‌'పై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించారు. ఈ తనిఖీలు డిసెంబరు 24వ తేదీ నుండి 31 వరకు జరిగాయి. ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు, కోర్టు విచారణల అనంతరం, ఈ సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 270 మందిని దోషులుగా నిర్ధారిస్తూ హైదరాబాద్‌లోని న్యాయస్థానాలు తీర్పునిచ్చాయి. దోషులుగా తేలిన వారికి జైలు శిక్ష విధించి, జైలుకు తరలించారు. అంతేకాకుండా, ఈ వ్యక్తులు పనిచేస్తున్న ప్రభుత్వ/ప్రైవేట్ కార్యాలయాలకు లేదా వారు చదువుతున్న విద్యాసంస్థలకు లేఖలు రాస్తూ, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతోంది. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరం. ఇది ప్రజల భద్రతకు పెను ముప్పు కలిగిస్తుంది. ఇటువంటి ఉల్లంఘనలను హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం కఠినంగా పరిగణిస్తోంది. నిందితులకు ఎటువంటి మినహాయింపు లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజల ప్రాణాలను రక్షించడం, రోడ్డు క్రమశిక్షణను కాపాడటం కోసం ఈ ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని పోలీసులు పేర్కొన్నారు. వాహనదారులందరూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ విభాగం కోరారు.

## ఇంటింటా మైనంపల్లి క్యాలెండర్ ఆవిష్కరణ



**నేరేడ్ మెట్, జనవరి 22,ప్రభాతవార్త :**
మైనంపల్లి యువసేన అధ్యక్షులు బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన మా దేవుడు మీరేనయ్య - ఇంటింటా మైనంపల్లి 2026 క్యాలెండర్‌ను మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు, తెలంగాణ టైగర్‌గా పేరొందిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ శాసనసభ్యులు, యువ నాయకుడు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేతుల మీదుగా గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు యాదవ్ మాట్లాడుతూ ప్రజలతో నిత్యం మమేకమై సేవ చేస్తున్న మైనంపల్లి కుటుంబం ప్రజల గుండెల్లో నిలిచిందని, అందుకే ఇంటింటా మైనంపల్లి అనే నినాదంతో క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకులకు యువత సంపూర్ణ మద్దతు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్టల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శిని, చంద్రశేఖర్‌తో పాటు కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, యువసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### వాహనాలను సురక్షితంగా నడుపాలి : ఆర్టీఏ కిష్టయ్య



సమావేశంలో ప్రసంగిస్తున్న సురేష్ లాల్ , చిత్రంలో ఆర్టీఏ లెక్కల కిష్టయ్య తదితరులు

**మలక్ పేట ,జనవరి 22, ప్రభాతవార్త:**
వాహనదారులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటిస్తూ వాహనాలను సురక్షితంగా నడుపాలని మలక్ పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య, ఆర్టీఏ నాన్ ఆఫియల్ సభ్యుడు సురేష్ లాల్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్స వాలని పురస్కరించుకొని మలక్ పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య ఆధ్వర్యంలో మలక్ పేట్ ఈస్ట్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాలలోని ట్రాఫిక్ నియమ, నిబంధనలపై రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని, మైనర్లకు ఎట్టి పరిస్థితులలో వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్స వాలను పురస్కరించుకొని విస్తృతంగా ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు పలు ప్రాంతాలలో ర్యాలీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహనదారులు వాహనాలను సురక్షితంగా నడుపుతూ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ లు నరేంద్ర పాల్ సింగ్, రాధిక బలరాం, ఏఎంవి ఐ లు జాన్, మధు సూదన్ రెడ్డి, రజిని, ఆశ్రఫ్ ఖాన్, హర్షిత పాల్గొన్నారు.

### జిహెచ్ఎంసి సర్కిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



**తుర్కయంజాల్‌జనవరి 22(ప్రభాతవార్త)**
తుర్క యంజాల్ సర్కిల్ లో రాగన్నగూడ వార్డు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా విష్ణువర్ధన్ రెడ్డి, వేముల వెంకటయ్య , పట్నం శ్రీశైలం, దుర్గయ్య అధ్యక్షులుగా సుంకరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా వై. ఓంకార స్వామి, ఉపాధ్యక్షులుగా ఓ వెంకటేష్, ఎం శ్రవణ్ నాయక్, ఓ గణేష్, ట్రెజరర్ గా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా వి గిరి నాయక్, ఎం అభిలాష్ యాదవ్, ఆర్. విక్రమ్ నాయక్, వి. సాయిబాబా, ఆర్గనైజర్ సెక్రెటరీగా ఎం చంద్రారెడ్డి, రాజేందర్ నాయక్, ఓ. గణేష్, జి.గిరి, ఎగ్జిక్యూటివ్ నెంబర్ వి. బాబు, వేముల శ్రీను, రాజ వర్ధన్ రెడ్డి, వాసు తదితరులు ఎన్నికయ్యారు.

### మొబైల్ యాప్ ద్వారా ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా అప్డేట్ చేయాలి : డిసి ఇంకేషాఫ్ అలీ



సమావేశంలో ప్రసంగిస్తున్న డిసి ఇంకేషాఫ్ అలీ

**మలక్ పేట, జనవరి 23, ప్రభాతవార్త:**
మొబైల్ యాప్ ద్వారా ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా అప్డేట్ చేయాలని మలక్ పేట ఈఆర్వో, డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ పేర్కొన్నారు. మలక్ పేట సర్కిల్ కార్యాలయంలో మలక్‌పేట్ నియోజకవర్గం బిఎల్ఓ సూపర్వైజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీ నిబంధనలకు అనుగుణంగా ఓటర్ లిస్టు లోని తప్పులు సరిదిద్దాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే బూతులో ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. ఫోటోలు తారుమారు అయితే వారిని సరి చేయాలని సూచించారు .సమాచారాన్ని తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఏఈఆర్వోలు సంజయ్, శ్రీకాంత్, మురళి బేగం, ముంతాజ్ షాబుద్దీన్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## 'బోధన్' బిజెపి ఇంఛార్జిగా మధుకర్‌రెడ్డి



మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 22 ప్రభాతవార్త:**
నిజామాబాద్ జిల్లా బోధన్ మున్సిపాలిటి బిజెపి ఎన్నికల ఇంఛార్జిగా సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ బోధన్ మున్సిపాలిటిలో బిజెపి జండా ఎగురవేయడమే లక్ష్యంగా కృషి చేస్తానని అన్నారు. జంగం మధుకర్‌రెడ్డి గతంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన సతీమణి జంగం శ్వేతా రెడ్డి ప్రస్తుతం ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు.

# మల్కాజ్‌గిరి అభివృద్ధికి మైలురాయి ఆర్‌యూబీలు

**: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఫలితం**



**నేరేడ్ మెట్, జనవరి 22,ప్రభాతవార్త :**
మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నప్పటికీ, రైల్వే రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీలు) మాత్రం మల్కాజ్‌గిరి శాసనసభ నియోజకవర్గంలోనే శాంక్షన్ కావడం యాదృచ్ఛికం కాదని, ఇది ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిరంతర కృషికి నిదర్శనమని మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీశ్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, వాటర్ వర్క్స్ వంటి అనేక శాఖల నుంచి అనుమతులు పొందడం, శాఖల మధ్య సమన్వయం సాధించడం, ఫైళ్లను వేగంగా ముందుకు కదిలించడం వంటి క్లిష్ట ప్రక్రియలను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించి పూర్తి చేశారని తెలిపారు. డిజైన్‌లు, అంచనాలు, సాంకేతిక మార్పులు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా భూమి, ఇళ్ల నష్టం తగ్గేలా ప్రణాళికలు సవరించారని చెప్పారు. రైల్వే నిబంధనలకు అనుగుణంగా ప్రతిపాదనలు రైల్వే బోర్డు మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి వంద శాతం రైల్వే నిధులతో పనులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని జగదీశ్ గౌడ్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర శాఖల మధ్య సమన్వయం సాధించి ప్రాజెక్టులను ముందుకు నడిపించడమే ఈ విజయానికి మూలమని అన్నారు. ఎక్కడ అవకాశం దొరికినా ప్రజల గొంతుశాసనసభలో, జీహెచ్‌ఎంసీ మండలిలో, కలెక్టర్ కార్యాలయంలో ఎక్కడ అవకాశం దొరికినా మల్కాజ్‌గిరి ప్రజల సమస్యలను గట్టిగా ప్రస్తావిస్తూ పరిష్కార దిశగా నడిపించిన నాయకుడు మర్రి రాజశేఖర్ రెడ్డేనని కొనియాడారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి ఫైల్ నుంచి ఫీల్డ్ వరకూ పనులు జరిగేలా నిత్యం పర్యవేక్షణ జరిపారని వివరించారు. రైల్వే చక్రబంధం నుంచి విముక్తి దిశగా అడుగు....రైల్వే చక్రబంధంలో ఇరుక్కుపోయిన మల్కాజ్‌గిరి సర్కిల్‌కు విముక్తి కల్పించే దిశగా చేపట్టిన ఈ ఆర్‌యూబీ పనులు పూర్తైతే ప్రాంతానికి మహర్దశ పట్టనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రోజూ ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్న ప్రజలకు ఇది నిజమైన ఊరటనిచ్చే అభివృద్ధి చర్యగా నిలుస్తుందని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల మద్దతుఎంతో మంది ప్రజాప్రతినిధులు మారినా, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే శ్రమజీవిగా మర్రి రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను పార్టీలకు అతీతంగా ప్రజలు, నాయకులు మరువలేరని జగదీశ్ గౌడ్ పేర్కొన్నారు. ఏండ్ల నిరీక్షణకు యువ కెరటంగా ముందుకు వచ్చి స్థానిక ఎమ్మెల్యే చేసిన కృషి అన్నిర్వచనీయమని, మల్కాజ్‌గిరి ప్రజలు ఆయనను గుండెల్లో నిలుపుకునేలా చేసిన పనులివేనని స్థానికులు అభినందిస్తున్నారని తెలిపారు.

# తిష్ట వేస్తున్న కుక్కలు, పందులు ..పట్టించుకోని అధికారులు



చెత్తకుప్పల వద్ద పందులు కుక్కలు ఉన్న దృశ్యం

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** కుక్కలు పందులు తిష్ట వేసి స్థానికంగా ప్రజలను ఇబ్బందులు కలిగిస్తున్న సమాచారం తెలిసినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేస్ 1, ఫేస్ 2, భగత్‌సింగ్‌నగర్, ఆర్కేపురంలో విపరీతంగా కుక్కల బెడద, చెత్త బెడద పెరిగిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలలో చెత్త విపరీతంగా నిల్వ ఉండడంతో కుక్కలు, పందులు అక్కడ తిష్ట వేస్తున్నాయి. దీంతో కాలనీలో పందులు, కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి రోడ్లపై నడుస్తూ పాఠశాలకు వెళ్లే పిల్లలు, వృద్ధుల పైన దాడి చేస్తున్నాయని, రాత్రి వేళల్లో కుక్కలు విపరీతంగా మొరుగుతున్నాయని నిద్రలేని పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పరిస్థితులపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు సమస్యను గుర్తించి తక్షణమే కాలనీలలోని చెత్త తొలగించి వ్యాధుల భారీ నుండి ప్రజలను రక్షించాలని వీధి కుక్కలను తీసుకువెళ్లాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ విజ్ఞప్తి చేశారు.

# బడంగ్‌పేట్ సర్కిల్ డివిజన్లలో అక్రమ కట్టడాలను ఆపాలి

**-సమీక్షా సమావేశంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ ఆదేశం**

**సరూర్‌నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్‌లోని డివిజన్లలో అక్రమ కట్టడాలను గుర్తించి నిర్మాణాలను ఆపాలని జిహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ కమీషనర్ (జడ్‌సి) చంద్రకళ ఆదేశించారు. బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలోని సర్కిల్ కార్యాలయంలో డిప్యూటి కమీషనర్ టిఎస్‌వివిఎన్ త్రిలేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన వివిధ విభాగాలకు సంబంధించిన సమీక్షా సమావేశానికి జోనల్ కమీషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె అన్ని విభాగాల వారీగా ప్రత్యేకంగా సమీక్ష జరిపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్లలో అక్రమ కట్టడాలను ఏ మాత్రం ఉపేక్షించరాదనీ అనుమతులు లేనివి.. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను వెంటనే ఆపాలని వార్డు ఆఫీసర్లకు సూచించారు. ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ ముగుస్తున్నందున వంద శాతం ఆస్తి పన్నులను, బకాయిలను వసూలు చేయాలని ఆమె స్పష్టం చేశారు. డివిజన్లలో పారిశుధ్యం సక్రమంగా ఉండాలనీ వార్డు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆమె అన్నారు. సర్కిల్‌లోని ఏ డివిజన్‌లో కూడా పగటి పూట వృధాగా వీధి లైట్లు వెలగకుండా చూడాలని అవసరమైన చోట కొత్తగా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని డిఇని ఆదేశించారు. అత్యవసర పనులు, టెండర్ల ద్వారా జరగాల్సిన పనులను ప్రారంభించాలని చంద్రకళ ఆదేశించారు.



సమీక్షా సమావేశానికి హాజరైన శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళను సన్మానిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తదితరులు

**జోనల్ కమీషనర్‌కు కాంగ్రెస్ నేతల సన్మానం**

కాగా బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళను నాదర్‌గుల్ డివిజన్-57కు చెందిన కాంగ్రెస్ నాయకుడు బోయపల్లి రాఘువేందర్‌రెడ్డి పలువురు సీనియర్ నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రజా సమస్యలను, పెండింగ్ పనులను ఆమె దృష్టికి తెచ్చారు. ఈ మేరకు స్పందించిన ఆమె తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ భీమిడి చంద్రపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దిండు శ్రీనివాస్‌గౌడ్, పెద్దబావి బాబు సుదర్శన్‌రెడ్డి, గోవర్ధన్, సునీల్, సుభాన్ యాదవ్, ప్రభాకర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఆర్టీసి బస్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి : చిగిరింత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఆర్టీసి బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిగిరింత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బాలాపూర్ గ్రామం నుండి కోఠి ఉమెన్స్ కాలేజీ వరకు గతంలో నడిచిన 102 సి సర్వీసు బస్సు పునః ప్రారంభమైంది. ఈ సందర్భంగా గురువారం స్థానిక గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి నర్సింహారెడ్డి ఆర్టీసి బస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదాయం లేదనే సాకుతో గతంలో నిలిపివేసిన బస్సు సర్వీసు తిరిగి ప్రారంభమైనందున విద్యార్థులకు, ఉద్యోగులకు, ఇతరత్రా నగరానికి వెళ్లే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఎంతో వెసులుబాటు ఉందని అన్నారు. బాలాపూర్ గ్రామానికి బస్సును పునరుద్ధరించినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బాలాపూర్ వేణుగోపాల స్వామి టెంపుల్ ఛైర్మన్ కొలను కృష్ణారెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, బండ్లగూడ సొసైటి మాజీ వైస్ ఛైర్మన్ కొలను తిరుపతిరెడ్డి, నాయకులు ఎర్ర జైహింద్, బాల్‌సింగని జంగయ్య, తూళ్ళ నరహరి గౌడ్, గొరిగె శ్రీశైలం, టేకుల శశిధర్‌రెడ్డి, క్యారగారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బాలాపూర్‌లో పునః ప్రారంభమైన ఆర్టీసి బస్సును ప్రారంభించి అందులో ప్రయాణిస్తున్న మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి తదితరులు

**ధర్మ రక్షణ సభకు రూ.2 లక్షల విరాళం**

అక్రమంగా నివసిస్తున్న బర్మా రోహింగ్యాలు, బంగ్లాదేశ్ ముస్లింలను వెనక్కి పంపాలని డిమాండ్ చేస్తూ బాలాపూర్‌లో ఈ నెల 24వ తేదీన గణేష్ సేన, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రతిష్టాత్మకంగా ధర్మ రక్షణ సభ కోసం బాలాపూర్‌కు చెందిన దంపతులు బడంగ్‌పేట్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత, మాజీ వైస్ ఛైర్మన్ నర్సింహారెడ్డిలు తమ వంతుగా రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు తమ నివాసంలో వారు సభ నిర్వాహక కమిటీకి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ కొలను శంకర్‌రెడ్డి, నాయకులు నవారు శ్రీనివాస్ రెడ్డి, కొలను కృష్ణారెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, నీరుడు శ్రీరాములు, ఇక్కె శ్రీనివాస్, రావుల మల్లేష్ పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎం.పరమేశ్వర్‌రెడ్డి

**మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 175 కుట్టు మిషన్లు పంపిణీ**

**ఉప్పల్, జనవరి 22 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ డివిజన్ వార్డు కార్యాలయంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు 175 కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తోపాటు, కార్పొరేటర్లు ఎం.రజితరెడ్డి, స్వర్ణరాజ్ శివమణి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన నడుస్తోందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మైనారిటీ మహిళలకు 175 కుట్టు మిషన్లు అందజేసినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా రాణించాలని సూచించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం పేద వర్గాల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.



మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎం.రజితరెడ్డి, స్వర్ణరాజు తదితరులు

### చూస్ బుక్స్ నో డ్రగ్స్ రన్ ను విజయవంతం చేయాలి



**మేడిపల్లి, జనవరి 22 ప్రభాతవార్త ;**
డ్రగ్స్ అనేది సమాజంలో ఒక మహమ్మారిగా తయారైందని .దాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎల్ బి నగర్ ట్రాఫిక్ ఏసిపి నవీన్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఇన్స్పెక్టర్ దుబ్బ కిషన్ అన్నారు. హైదరాబాద్ రన్నర్స్ సహకారంతో శాంతి వనం రన్నర్స్ ఆధ్వర్యంలో రన్ ఫర్ చూస్ బుక్స్ నో డ్రగ్స్ అనే నినాదంతో ఫిబ్రవరి 22వ తేదీన నారపల్లిలోని నందనవనం పార్కు రన్ నిర్వహిస్తున్నారు. దానికి సంబంధించిన పోస్టర్ ను చెంగిచెర్ల శాంతి వనం పార్క్ లో బుధవారం విడుదల చేశారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా బుక్స్ ను చదవడం అలవాటు చేసుకోండి అనే ఉద్దేశంతో ఈ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రన్ 16 కే 10 కే 5 కె3కే ఉంటుందనీ తెలిపారు. కాబట్టి ప్రతీ ఒక్కరు వయసుతో సంబంధం లేకుండా అందరూ రిజిస్ట్రేషన్ చేసుకుని రన్ లో పాల్గొనాలని కోరారు.

### పారిశుధ్య కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన



పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ శైలజ , ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు

**మేడిపల్లి, జనవరి 22 ప్రభాతవార్త ;**
హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ కమీషనర్ ఆదేశాల మేరకు బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగముగా ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు తడి, పొడి , హానికర చెత్త వ్యర్థాల వర్గీకరణ (వేస్ట్ సిగ్రగేషన్) తడి చెత్తను అదే ప్రదేశంలో ఎరువుగా మార్చే ప్రక్రియ (ఆన్ సైట్ కంపోస్టింగ్) పై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇట్టి అవగాహన కార్యక్రమం లో మేడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల యందు నిర్వహించిన కార్యక్రమం లో బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ఎ. శైలజా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్ , అధ్యాపకులు, మునిసిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

### వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

**నాచారం, జనవరి 22 ప్రభాతవార్త :** నాచారం లో రూ. 11.55 లక్షల రూపాయల భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి పనులు ప్రారంభించారు. అన్నపూర్ణ కాలనీలోని బుడగ జంగాల స్మశాన వాటికలో రూ. 50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధిపనుల వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు బుడగ జంగాల అసోసియేషన్ సభ్యులు బారాస నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఐఎస్ సదన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 22 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ విష్ణుపురి కాలనీలో రూ.34.69లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు, ప్రెస్ కాలనీలో రూ.32.45లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు, సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో రూ.60లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమా లలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, ప్రెస్ కాలనీవాసులు దేవేందర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, నవీన్ రెడ్డి, శంకరాచారి, నవీన్ రెడ్డి, విష్ణుపురి కాలనీవాసులు ము త్యం రెడ్డి, వెంకటేష్, యాదగిరిచారి, శ్రీనివాసచారి, అంజ య్య, సింగరేణి ఆఫీసర్స్ కాలనీ వాసులు సర్వేశ్వర్‌రావు, కెఎస్ఎన్ రెడ్డి, విజయ్ కుమార్, వెంకటరమణ, కెఎస్ఆర్ శర్మ పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలి



అధికారులతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న అరవింద్‌శర్మ, నగేష్

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీ రోడ్ నెంబర్ 1,2లో సీసీ రోడ్డు పనులను త్వరగా ప్రారంభించి ప్రజల ఇబ్బందులను వెంటనే తొలగించాలని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నాగేష్, జిహెచ్ఎంసి ఏఈ ప్రశాంతి, మాధవిలతో కలిసి గురువారం అరవింద్‌శర్మ సిసి రోడ్డు పనులకు సంబంధించి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్డుకు అవసరమైన ప్రణాళికను వెంటనే తయారు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. గత కొన్ని నెలలుగా రోడ్డు గుంతల మయం కావడంతో కాలనీ అధ్యక్షుడు సంజీవరెడ్డి స్థానిక ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి దృష్టికి తీసుకువెళ్లగా, సబితాఇంద్రారెడ్డి ఆదేశానుసారం పరిశీలించడం జరిగిందని తెలిపారు. త్వరగా పనులు ప్రారంభించి కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సుబ్బారావు, సెక్రటరీ మధు, నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల శేఖర్ పాల్గొన్నారు.

### హెవి వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య సేవలు



లోగోను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**తార్నాక, జనవరి 22 ప్రభాతవార్త :** సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ నగర వ్యాప్తంగా పలు ఉచిత కంటి శిబిరాలు నిర్వహిస్తూ తమ సేవా దృక్పథాన్ని చాటుతోంది. ఇందులో భాగంగా గురువారం నగరంలో హెవి మోటర్ వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించింది. మెరుగైన దృష్టి సంరక్షణ ద్వారా సురక్షితమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో డ్రైవర్ దృష్టి - మెరుగైన దృష్టి ద్వారా రోడ్డు భద్రత" అనే రహదారి భద్రత అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. ప్రచారంలో భాగంగా వాణిజ్య డ్రైవర్లతో పాటు హెవీ వాహన డ్రైవర్లకు వక్రీభవన లోపాలు, కంటిశుక్లం తదితర దృష్టి సంబంధిత సమస్యలపై ఉచిత కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తదుపరి చికిత్స అవసరమైన డ్రైవర్లను సమీపంలోని వాసన్ ఐ కేర్ కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారు. అర్హత కలిగిన లబ్దిదారులకు పరిమిత స్లాట్లలో ఉచిత కంటిశుక్లం శస్త్రచికిత్సలు, ప్రీ-ఆపరేటివ్ పరీక్షలు మరియు అవసరమైన మందులు కూడా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వాసన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ నళిని కాంత ఎం., డాక్టర్ ఉదిత్ అజ్మాని, డాక్టర్ నయన టి., డాక్టర్ మనోజ్ కుమార్ పి.లు ప్రారంభించగా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐ కె. రామకృష్ణ, ఎస్ఐ వినోద్ కుమార్‌లు పాల్గొన్నారు.

### ఘనంగా భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు



భక్త మార్కండేయ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 22 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చిలుకానగర్ శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భక్త మార్కండేయ జయంతి వేడుకలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు.శ్రీ భక్త మార్కండేయ స్వామి కృపా కటాక్షాలు తనపై మెండుగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైనందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మార్కండేయ దేవాలయంలో ఖాళీ స్థలంలో పై కప్పు రేకులతో పూర్తిస్థాయి పనులు చేపట్టి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. . ఈ సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శ్రీ భక్త మార్కండేయ స్వామికి విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బారాస సీనియర్ నేత బన్నాల ప్రవీణ్, బిజెపి నేత తాడూరి శ్రీనివాస్, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సకినాల ప్రసాద్, కార్యదర్శి బెజగం శ్రీనివాస్, కోశాధికారి పెండెం నాగార్జున, సలహాదారులు దేవసాని బాలచందర్, గూడ శ్రీశైలం, దాసరి శ్రీనివాస్, బోడ విద్యాసాగర్, వడ్డేపల్లి కిషోర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన



విద్యార్థులతో ఏసిపి చంద్ర కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్, ఎస్ఐ కార్తీక్

**సైదాబాద్, జనవరి 22 ప్రభాతవార్త:** అరైవ్..అలైవ్..రోడ్డు భద్రతా ప్రచారంలో భాగంగా సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ డివిజన్‌లోని లీడ్ ఇండియా పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు, రోడ్డుపై వెళ్తున్నప్పుడు పాటించాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇస్తూ, ప్రశ్న.. సమాధానం రూపంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సౌత్ ఈస్ట్ జోన్ ఏసిపి చంద్ర కుమార్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్, ఎస్ఐ కార్తీక్, పాఠశాల ప్రిన్సిపాల్ సత్య ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### జాగో భాగ్యనగర్ చలో బాలానగర్ విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగ నరసింహగుప్తా,

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** జాగో భాగ్యనగర్ చలో బాలానగర్ ధర్మరక్షణ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. చైతన్యపురి డివిజన్ బిజెపి కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున సభకు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రాల శంకర్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

### చిలుకానగర్ డివిజన్‌లో ఫాగింగ్ చేపట్టాలి : బన్నాల గీత



ఎంటమాలజీ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, జనవరి 22 ప్రభాతవార్త :** దోమలబెడద నివారణకు ఫాగింగ్ చేపట్టాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం వార్డు కార్యాలయంలో ఎంటమాలజీ అధికారులు, ఇతర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల బెడద తీవ్రంగా ఉందని, ఉప్పల్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగించకపోవడం వల్ల దోమల తీవ్రత చాలా ఎక్కువ అయ్యిందని తెలిపారు. ఎంటమాలజీ అధికారులు దీనిని సీరియస్‌గా తీసుకుని మందులు పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ డిపార్ట్మెంట్ సూపర్వైజర్లు అజయ్, మహేందర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.